క్లుప్తంగా

నేటి నుంచి వారాల వారోత్సవాలు



పాండురంగస్వామి ఆలయం

కుల్కచర్ల: శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి వారాల ఆలయ 21వ వార్షికోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరణం నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిధి బండవెల్కిచర్లలో 17వ తేది నుంచి 19 వరకు ఉత్సవాలు జరగనున్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగా నేడు శకటోత్సవం, 18న సాధారణ కార్యక్రమాలు, 19న శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి వారాల కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం చేపట్టనున్నట్లు వెల్లడించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులుకావాలని సూచించారు.

సీసీరోడ్డు ప్రారంభం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ

బంట్వారం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి అన్నారు. శనివారం కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే, స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్ సహకారంతో నియోజకవర్గం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాచి రెడ్డి, రాంచంద్రారెడ్డి నర్సింహులు, సంజీవయ్య, నర్సింహులు, మొయినొద్దీన్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



శివరాం నాయక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దేముల్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాషాపూర్ మాజీ సర్పంచ్ శివరాం నాయక్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ రుద్రారం యువ నాయకుడు మైపాల్‌రెడ్డి, నాయకుడు సాయిని శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సంఘం నాయకులు

కొడంగల్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రయాణికులు, బాటసారులకు చల్లటి మజ్జిగను అందజేసి, వేసవి తాపం నుంచి ఉపశమనం కల్పిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కటుకం శివకుమార్ గుప్తా, సంఘం నాయకులు కోట్రిక లక్ష్మీనారాయణ, ఆకుల ప్రవీణ్, చందు పాల్గొన్నారు.

మైసమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు



అమ్మవారి సన్నిధిలో నరేందర్‌రెడ్డి

కొడంగల్: మైసమ్మతండా మైసమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నరేష్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతికి పూజలు

కందుకూరు: ఆకులమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు చేశారు. వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా దీవించు తల్లీ అని మొక్కుకున్నారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కవిత అరెస్టు అక్రమం

- ఇది ముమ్మాటికీ రాజకీయ కుట్రే
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్, పార్టీ నాయకులు

ధారూరు: ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమమని, ఇది ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆరోపించారు. శనివారం ఆయన.. పార్టీ పిలుపు మేరకు.. గులాబీ శ్రేణులతో కలిసి కవిత అరెస్టుకు నిరసనగా.. ధారూరు తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేశారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆనంతరం ఆనంద్ మాట్లాడారు. సుప్రింకోర్టులో విచారణ జరుగుతుండగానే ఆమెను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశ వైఖరీని విడనాడాలని హితవు పలికారు. ఈడీని పావులా వాడుకుని, పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఎ.అంజయ్య, చంద్రమౌళి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటయ్య, భీంసేన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌ల అందజేత



పరీక్ష ప్యాడ్‌లతో విద్యార్థులు

దౌల్తాబాద్: కుదురుమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన యువనాయకుడు సూర్యప్రకాష్ రెడ్డి.. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలో ప్రతి ఒక్కరూ ఏ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయప్ప, పాఠశాల మాజీ చైర్మన్ లాలప్ప, మాజీ సర్పంచ్ అనిత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

యాలాల: పదో తరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత, అగ్గనూరు, ప్రతిభ, గౌతమి పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ చెప్పారు. ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, ప్రైవేటు స్కూళ్లకు చెందిన 715 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు.

మార్కెట్‌కు 95బస్తాల వేరుశనగ రాక

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 95 బస్తాల వేరుశనగను రైతులు తీసుకువచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ.6,600 నుంచి రూ.6,850 ధర పలికిందని ఆమె చెప్పారు. అలాగే మొక్కజొన్న 185 సంచులు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,200 నుంచి రూ.2,250 వరకు, కందులు 86 సంచులు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.10,050 నుంచి రూ.10,300వరకు ధర చెల్లించి, విక్రయించినట్లు ఆమె వెల్లడించారు.

ఆర్థిక సహాయం

ధారూరు: పంట పొలానికి నీరందించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడిన నాగారం మద్దులపల్లి శ్రీనివాస్ కుటుంబానికి శనివారం శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రూ.5వేలను మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జోగు అనంతయ్య, నారాయణ, వెంకటయ్యల ద్వారా మృతుడి భార్య అనితకు అందజేశారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం.. ఉద్యోగ, కార్మికులను దోపిడీ చేయడమే కాకుండా.. కార్మిక చట్టాలను కాలరాస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి రాములు ఆరోపించారు. శనివారం వికారాబాద్‌లోని క్లబ్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదేళ్లుగా బీజేపీ సర్కార్.. కార్మిక వ్యతిరేక విధానాలకు పాటుపడుతుందని మండిపడ్డారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడలా.. పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మైపాల్, కార్యదర్శి రామకృష్ణ, భారతి, అనిత, లక్ష్మి, సుజాత, హాలిబాయి శారద తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని కేశవగూడ గ్రామంలో ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ పథకం కింద మంజూరైన రూ.10లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామాల్లో కావాల్సిన వసతులను పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. గ్రామాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో తమ్మలి రవీందర్, షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింహులు, చెన్నయ్య, సత్యం, గ్రామస్తులు ఉన్నారు.

ఎంపీ, ఎమ్మెల్సీ కాంగ్రెస్ ఖాతాలోకే

మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి



జితేందర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలు

కొత్తూరు: త్వరలో జరగనున్న ఎంపీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు రావడంతో శనివారం ఆయనను పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు. అనంతరం జితేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం మాటలతోనే పదేళ్ల పాలన సాగించినట్లు ఆరోపించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి శ్యాంసుందర్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జే, సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్, వస్పుల మహేందర్, జంగ నర్సింహ్మా పాల్గొన్నారు.

రాజీతో ఇద్దరూ గెలిచినట్లే

సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి



చేవెళ్ల: మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు

షాద్‌నగర్: రాజీయే రాజ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి సీయం రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు సత్వరం పరిష్కరించబడతాయన్నారు. తద్వారా కక్షిదారులకు సత్వరం పరిష్కారం లభిస్తుందని సూచించారు. అందరు రాజీ మార్గంలోనే నడవాలన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు 186, సివిల్ కేసు 1, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 383, పిట్టి కేసులు 2730, బ్యాంకు పీఎల్‌సీ కేసు 1, ల్యాండు కేసులు రెండు పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం కేసుల పరిష్కారంలో రూ.15లక్షల 26వేల 500 జరిమానాలు విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రవీంద్రసింగ్, జూనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్, అడిషనల్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాల్‌రావు, న్యాయవాదులు సబియా సుల్తానా, శ్రీనివాస్, అంజయ్య యాదవ్, శ్వేత, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగరాజు, లింగం గౌడ్, ఇంజమూరి నర్సింలు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో..

చేవెళ్ల: లోక్ అదాలత్‌లతో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాలు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని చేవెళ్ల సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి, జూనియర్ కోర్టు జడ్జి కిరణ్‌కుమార్, రిటైర్డ్ జడ్జి సాంబశివరావులు అన్నారు. చేవెళ్లకోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 2843 కేసులు పరిష్కారం కాగా ఇందులో 15లక్షల 87,260 రూపాయల జరిమాన విధించినట్లు తెలిపారు. ఇందులో ట్రాఫిక్ పోలీస్‌లకు సంబంధించినవి 415 మద్యం తాగి డ్రైవింగ్ చేసిన కేసులు కాగా వీటికి 9లక్షల 87,500ల జరిమాన విధించినట్లు తెలిపారు. కోర్టుల్లో ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు చక్కటి మార్గాలని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం పాల్గొన్నారు.

'వందరోజుల ప్రజాపాలన భేష్'

మొయినాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల ప్రజాపాలన బాగుందని ఆ పార్టీ నాయకుడు రాఘవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రజా పాలన అంటే ఏమిటో వంద రోజుల్లో చేసి చూపించారన్నారు. తెలంగాణ దొరచేతుల్లో నుంచి ప్రజల చేతుల్లోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌నే గెలిపించాలని కోరారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

- నియమావళికి అనుగుణంగా అధికారులు పని చేయాలి
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు.. ఎన్నికల అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అదే సమయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో వివిధ మౌలిక సదుపాయలతో పాటు అన్ని ఏర్పాట్లను చూసుకోవాలని అధికారులకు సూచించారు. పార్లమెంటు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ చొప్పున 25 మంది సెక్టోరల్ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల పోలింగ్ కేంద్రాల్లో 1400 మంది, పట్టణ ప్రాంతాల్లో అయితే 1500 మంది ఓటర్లు మించకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఎస్‌ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, అకౌంట్స్ టీంలతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ నోడల్ అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో హస్తందే హవా

- వంశీచందర్‌రెడ్డి గెలుపే ధ్యేయం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు శనివారం అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల వ్యవధిలో అమలు చేసిన పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీ నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు కుర్వమల్లేశ్‌యాదవ్, నర్సింలు, శ్రీనివాస్, రవియాదవ్, అంజయ్య, జంగయ్య, శ్రీనివాసులు, యాదయ్య, కోతి శ్రీనివాస్, వేణుగౌడ్, కృష్ణయ్య, కుమార్, రాజ్‌కుమార్, శ్రీను, నర్సింలు, కృష్ణయ్య, శ్రీను, రాజు, అమీర్, కుమార్, అశోక్, శివకుమార్, ప్రవీణ్, సాయికుమార్, షర్ఫొద్దీన్, మోహిన్, సాయికిరణ్, నర్సింలు, రాములు, శివ, శేఖర్, యాదయ్య, శ్రీశైలం, రత్నయ్య, మహేందర్, సాయన్న, రాజు, సత్తయ్య, మల్లేశ్, రాజు, చంద్రయ్య ఉన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో పలువురు మహిళలను పరిగిలో ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు జగన్‌మోహన్ ముదిరాజ్, జిల్లా నేతలు సన్మాన గ్రహీతలను అభినందించారు. - పరిగి

నిర్లక్ష్యం చేస్తే.. భవిష్యత్తు ప్రశ్నార్థకం



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న గోవర్ధన్

దోమ: చదవు విద్యార్థి భవిష్యత్తును నిర్ణయిస్తుందని, అలాంటి చదువు పట్ల నిర్లక్ష్యం చేస్తే.. అది ప్రశ్నార్థకంగా మారుతుందని బీసీ సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. శనివారం మండల పరిధి మోత్కుర్ గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో పతో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పది వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాసి, ఉత్తమ ఫలితాలను రాబట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మాచారి, నాగప్ప, మల్లేశ్, మాజీ ఉపసర్పంచ్ బుగ్గయ్య, గ్రామస్తులు వెంకట్‌రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

రేపటి నుంచి వార్షిక పరీక్షలు

- నియోజకవర్గంలో 20 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 5272 మంది విద్యార్థులు



కేశంపేట పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను రాస్తున్న ఉపాధ్యాయులు



షాద్‌నగర్‌లో పరీక్ష కేంద్రం

షాద్‌నగర్: ఏడాది పాటు చదివిన చదువుకు పరీక్ష రూపంలో ప్రతిభను వెలికి తీసే సమయం ఆసన్నమైంది. పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

20 పరీక్షా కేంద్రాలు

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో మొత్తం 5272 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. కేశంపేటలో మూడు కేంద్రాలు, షాద్‌నగర్‌లో 11 కేంద్రాలు, కొందుర్గు, చౌదరిగూడల్లో ఒక్కో కేంద్రం, నందిగామ ఒకటి, కొత్తూరులో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేశంపేటలో 600మంది, షాద్‌నగర్‌లో 2557 మంది, కొందుర్గులో 360, చౌదరిగూడలో 270 మంది, కొత్తూరులో 750, నందిగామలో 735 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు.

చురుగ్గా ఏర్పాట్లు

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు నీటి వసతితో పాటుగా, పరీక్ష రాసేందుకు టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద విధిగా ఏఎన్‌యంను నియమించారు. అన్ని తరగతి గదుల్లో విధిగా వెలుతురు ఉండే విధంగా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాలకు సమయానికి ప్రశ్నాపత్రాలను పంపించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు

మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పరీక్షల్లో జబ్లింగ్ పద్ధతిని అవలంబిస్తున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పరీక్షల్లో సహరించకుండా ప్రతీ పరీక్షకు ఇతర సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించనున్నారు. అదేవిధంగా ఓ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులను అదే పాఠశాలలో పరీక్ష రాకుండా ఇతర పరీక్షా కేంద్రాల్లో రాసే విధంగా జబ్లింగ్ పద్ధతిని పాటించనున్నారు. అంతే కాకుండా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ప్రత్యేక పోలీసులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లను అనుమతించడం లేదని అధికారులు తెలిపారు.

ఇబ్బంది కలగకుండా చర్యలు



పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు టేబుల్స్‌పై హాల్‌టికెట్ నంబర్లు వేశారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌ల అనుమతి లేదు.

– శంకర్‌రాథోడ్, ఎంఈఓ, షాద్‌నగర్